# చినుకు పడితే పరేషానే..

- చిన్నపాటి వర్షానికి చీకటిలో జాగారం
- జంగోనిగూడలో విద్యుత్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు



కరెంట్ పోవడంతో చీకటిలో జంగోనిగూడ గ్రామం

నందిగామ, జూన్ 24: వర్షపు చినుకు పడితే చాలు ఆ ఊరిలో కరెంట్ ఉండదు. ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. చిన్నపాటి వర్షానికే నందిగామ మండల జంగోనిగూడ గ్రామంలో విద్యుత్ అంతరాయం ఏర్పడి ఆ గ్రామ ప్రజలు రాత్రంతా జాగారం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో పాటు దోమలు అధికమై నిద్రలేమి గురవుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరెంట్ సమస్యతో గ్రామ ప్రజల తీవ్ర ఇబ్బందులు గురువుతున్నారు. ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా విద్యుత్ సమస్య తలెత్తతుండడంతో నానాతంటాలు పడుతున్నారు. నిరంతరం పరిశ్రమలు, వివిధ కంపెనీలు విద్యుత్ అందిస్తున్న అధికారులు గ్రామంపై ఎందుకు చిన్నచూపు చూస్తున్నారో అర్థంకానీ పరిస్థితి. పరిశ్రమలు, కంపెనీలపై ఉన్న శ్రద్ధ గ్రామానికి సరఫరా అయ్యే విద్యుత్ లేదా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**గ్రామంలో ఇలా**

జంగోనిగూడ గ్రామంలో సుమారు 60కిపైగా నివాసాలు ఉన్నాయి. ఇందులో సుమారు 400మందికి జనాభా ఉంది. గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించడంతో పాటు రాత్రి సమయాల్లో కరెంట్ పోయినప్పుడు ఫోన్ చేసిన స్పందించని పరిస్థితి. విద్యుత్ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



మా గ్రామంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. రాత్రి సమయాల్లో కరెంట్ ఉండడం లేదు. కరెంట్ లేకపోవడం రాత్రిపూట బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. అధికారులు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించాలి.

-జంగ శేఖర్, గ్రామస్తుడు, జంగోనిగూడ

### కరెంట్ వస్తలేదు



చిన్నపాటి వర్షానికే రాత్రిపూట కరెంట్ పోతుంది. కరెంట్ పోయినప్పుడు ఇంట్లో పిల్లలు, మేము ఇబ్బంది పడుతున్నాం. కరెంట్ ఎప్పుడు వస్తుందో కూడా తెలియదు. కరెంట్ నిరంతరం అందించేలా చూడాలి.

-సంజమ్మ, జంగోనిగూడ గ్రామం

## బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

### సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, జూన్ 24: గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో, మనస్థాపానికి గురై మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో చేసిన పనులకు బిల్లులు అందక మాజీ సర్పంచ్‌లు పడుతున్న బాధలు వర్ణనాతీతమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని బీబీ రాజుపల్లి మాజీ సర్పంచ్ దాసరి శంకరయ్య గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోపాటు తన సొంత నిధులు రూ.10 లక్షలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో మనోవేదన గురైన శంకరయ్య పురుగుల సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన శంకరయ్య కుటుంబానికి రూ.కోటి పరిహారాన్ని అందించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి



గిరిజన వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సుజాత

కడ్తాల్, జూన్ 24: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఎంపీడీవో సుజాత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హాస్టల్, తరగతి, వంట గదులు, వసతి గృహం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ రాములు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి చేయూత

కడ్తాల్, జూన్ 24: తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన, గజ్జల శాంతమ్మ ఇంటి నిర్మాణానికి మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరుపున శాంతమ్మ ఇంటి నిర్మాణానికి సిమెంట్, సీకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు, నాయకులు శ్రీధర్ పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి




ఇబ్రహీంపట్నం, జూన్ 24 : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన రవింద్రసాగర్ బదిలీపై వెళ్లటంతో ఆయన స్థానంలో సత్యనారాయణరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

## చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా వెంకటేశం బాధ్యతల స్వీకరణ



చేవెళ్లటౌన్, జూన్ 24: చేవెళ్ల మున్సిపాలిటీ కమిషనర్‌గా వెంకటేశం మంగళవారం చేవెళ్లలోని మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన పూర్ణచందర్ బదిలీపై వెళ్లారు. కొంపల్లి మున్సిపాలిటీలో మేనేజర్‌గా ఉన్న వెంకటేశం ప్రమోషన్‌పై చేవెళ్ల మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు.

## లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ల అందజేత



లబ్ధిదారురాలికి ప్రొసీడింగ్ అందజేస్తున్న కార్యదర్శి స్వరూప్

కేశంపేట, జూన్ 24 : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శి స్వరూప్ ప్రొసీడింగ్‌లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామానికి 33 ఇండ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 13మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణంకోసం పునాది పూర్తైందని, మరో 10మంది ముగ్గు పోసేందుకు సిద్ధంగా ఉన్నారని, ఎటూ తేల్చుకోలేనివారు 10మంది వరకు ఉంటారన్నారు. నిర్మాణాల్లో వేగం పెంచి నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని, లేనిపక్షంలో బిల్లు రాదనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారురాళ్లు భీమమ్మ, నీలమ్మ, సుగుణమ్మ, లక్ష్మమ్మ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయాంజాల్, జూన్ 24 : తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ పరిధిలో సాధారణ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేతలో భాగంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తుర్కయాంజాల్ సబ్‌స్టేషన్ విద్యుత్ శాఖ ఏఈ మంగళవారం తెలిపారు. మన్నెగూడ ఫీడర్ పరిధిలోని మన్నెగూడ, హెవెన్స్ కార్నర్, ఎన్ఎస్ఆర్ నగర్ కాలనీ, శ్రీ సాయి హ్యపి హోమ్స్, సాయి టౌన్ షిప్, అవివా హోమ్స్, ఎంఎం కుంటలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపియనున్నట్లు తెలిపారు. అదే విధంగా బెటెక్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న గ్రామస్తులు

## ఉచితంగా నోటు బుక్స్, బ్యాగుల పంపిణీ

షాద్‌నగర్‌రూరల్, జూన్24: ఫరూఖ్‌నగర్ మండలంలోని నాగులపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు మంగళవారం ఉచితంగా నోటుపుస్తకాలు, బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి మనోహర్ పాల్గొని విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత

మంచాల, జూన్ 24 : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం మంచాల మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ భిక్షపతి ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, కాలిక్ లేటర్, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంచాల, చెన్నారెడ్డిగూడ పాఠశాల ఉపాధ్యాయులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాందాస్, ఎంపీడీవో బాలశంకర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు బాల్‌రాజ్‌తో పాటు వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న భిక్షపతి, అధికారులు



షాద్‌నగర్ వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయ ఆవరణంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎంఈవో మనోహర్‌తో కలిసి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరరావు నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షుడు మాణిక్యం, వనితాక్లబ్ అధ్యక్షురాలు మధుప్రియ, సభ్యులు నవీన్‌కుమార్, సురేష్‌కుమార్, వెంకటరమణ, పాండురంగయ్య, నర్సింహ, విజయ్‌కుమార్, శ్రీనివాస్, బాలరాజేశ్, నవీన్‌కుమార్, సత్యనారాయణ, పెద్దిరాంమోహన్, విజయ్, ఆనంద్, రామ్మోహన్, శ్రీనివాసులు, రవికుమార్, స్రవంతి, సురేష్‌కుమార్, స్వప్న, వెంకటరమణ, రమ, ప్రకాశ్, కరుణాకర్, త్రినాథ్‌కుమార్, రూపాదేవి పాల్గొన్నారు.

- షాద్‌నగర్‌టౌన్, జూన్ 24

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



షాబాద్, జూన్ 24: మండలంలోని నాగర్‌కుంట ప్రాథమికోన్నత పాఠశాలలో 1995–1996 సంవత్సరంలో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మంగళవారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నాడు పాఠాలు బోధించిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా మోకిలా పోలీస్‌స్టేషన్ సిబ్బంది డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం యాంటీ డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై పద్మ, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- శంకర్‌పల్లి, జూన్ 24

## నేడు ప్రజాభిప్రాయ సేకరణ



కొందుర్గు, జూన్ 24: చౌదరిగూడ మండల పోలీస్‌స్టేషన్ నిర్మాణంపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం జరుగుతుందని జేపీసీ నేతలు అన్నారు. పోలీస్‌స్టేషన్ నిర్మాణం చౌదరిగూడలోనే చేపట్టాలని, అఖిలపక్షం ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. పోలీస్‌స్టేషన్ లాల్‌పహాడ్ లో నిర్మించకుండా చౌదరిగూడెంలోనే నిర్మించాలన్నారు. గతంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణంకోసం స్థలం కేటాయించడం జరిగిందని, అదే స్థలంలో నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రావు, రాములు, సయ్యద్ హఫీజ్, రాజు, బాబురావు, చంద్రబాబుగౌడ్, భూపాలచారి, శ్రీను, అనిల్, జబ్బార్, యాదయ్య, వెంకటేష్, నర్సింగ్‌రావు, అక్రమ్, వెంకటస్వామి, రాములు, బస్వరాజు, చెన్నయ్య, జంగయ్య, భిక్షపతి, రాజు, గణేష్, జానీ, తదితరులు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

### డీసీపీ చైతన్య కుమార్



సైదాబాద్, జూన్ 24: డ్రగ్స్ వల్ల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు దెబ్బతింటుందని, అందుకోసం వాటికి దూరంగా ఉండాలని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్ అన్నారు. సైదాబాద్‌లో మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ఏర్పాటు చేసిన నార్కోటిక్స్ ఎన్ ఫోర్స్ మెంట్ వింగ్ యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని, అందుకోసం యువత, విద్యార్థులు వాటికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వాడితే పోలీసులకు పెట్టుబడి కేసులలో ఇరుక్కుని, బంగారు భవిష్యత్తుకు దూరమవుతారని, అందుకోసం వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, సౌత్ ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ శ్రీకాంత్, సైదాబాద్ డివిజన్ ఏసీపీ సోమ వెంకటరెడ్డి, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కుమార్, సెక్టర్ ఎస్సై సైదమ్మ పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం

మొయినాబాద్, జూన్ 24: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి తప్పిపోయాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లాలోని రేణిగుంట పరిధిలోని తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన కె.అశ్రిత్ మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటల నుంచి విద్యార్థి పాఠశాలలో కనిపించడం లేదని పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ తెలిపారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో ప్రిన్సిపాల్ మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## చిల్లర రాజకీయాలు మానుకోవాలి

బడంగ్‌పేట్, జూన్ 24: కాంగ్రెస్ నాయకులు తమ స్థాయిని మర్చిపోయి మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి. సవితా ఇంద్రారెడ్డిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ మహేశ్వరం మండల అధ్యక్షుడు రాజు నాయక్, మర్యాద రాఘవేందర్ రెడ్డి, శంకరయ్య, తదితరులు ధ్వజమెత్తారు. మహేశ్వరం మండలంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్న ఉద్దేశంతోనే పార్టీ మారడం జరిగిందని రాఘవేందర్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ ఏ ఒక్కటి కూడా నెరవేర్చకపోవడం, గతంలో ఉన్న పథకాలను కూడా ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం కావడంతోనే బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలకు పాల్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సారథ్యంలోనే అభివృద్ధి జరుగుతుందన్న నమ్మకంతోనే పార్టీ వీడడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో సబితా ఇంద్రారెడ్డి చేసిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో చూపించాలని వారు సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు అశోక్ గౌడ్, సామ జానారెడ్డి, పబ్బ ఆంజనేయులు గౌడ్, అబ్బ బాలరాజ్ గౌడ్, వెంకటేష్ గౌడ్, కుమార్, దయానంద్ గౌడ్, ఎం. కుమార్ గౌడ్, మహేష్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కొబ్బరికాయల వేలం



వేలం పాటను నిర్వహిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

కడ్తాల్, జూన్ 24: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మతల్లి, రామాలయ, శివాలయాల ఆవరణలో కొబ్బరికాయలు, వాహనాల పూజ రశీదు రుసుం వసూలు చేసుకునేందుకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో జిల్లా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటను నిర్వహించారు. కొబ్బరికాయలు అమ్ముకునేందుకు నిర్వహించిన వేలం పాటలో మైసిగండి గ్రామానికి చెందిన రమావత్ అమృనాయక్ రూ.39, 63,500 లక్షలకు దక్కించుకున్నారు. అదే విధంగా వాహనాల పూజ రసీదు రుసుం వసూలుకు నిర్వహించిన వేలం పాటలో ముగ్గురు పాల్గొన్నగా, మైసిగండి గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ రూ.13, 31,000 లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు మోహన్‌రావు, ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, ఈవో స్నేహలత, నిర్వాహకుడు భాస్కర్‌నాయక్, అర్చక సిబ్బంది యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, నాయకులు అమృనాయక్, రాజూనాయక్, అమర్‌సింగ్‌నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రంథాలయ స్లాబ్ నిర్మాణం



గ్రంథాలయ స్లాబ్ నిర్మాణం చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట, జూన్ 24 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో గ్రంథాలయ స్లాబ్ నిర్మాణ పనులను గ్రామస్తులు మంగళవారం ప్రారంభించారు. గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమని, త్వరలో పనులు పూర్తి చేసి యువత, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివయ్య, నాయకులు కృష్ణారెడ్డి, రాణి, శంకరయ్య, శ్రీను, బాలరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

## అధిక దిగుబడులను సాధించాలి

### ఆర్డీవో అనంతరెడ్డి

యాచారం, జూన్23: రైతులకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలందించడం కోసం రైతు నేస్తం కార్యక్రమం ఎంతగానో మేలు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అన్నారు. మంగళవారం యాచారం మండలంలోని చౌదర్‌పల్లి, యాచారం, మాల్ గ్రామాల్లోని రైతు వేదికలో అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాల మేరకు పంటలను పండించి అధిక దిగుబడులను సాధించే విధంగా రైతులు కృషి చేయాలన్నారు. రైతులందరికీ రైతు భరోసా పథకం వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, ఏవో రవినాథ్, సీఐ నందీశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరసింహ, నాయకులు, రైతులు ఉన్నారు.

**కేశంపేటలో..**

కేశంపేట : మండల పరిధిలోని అల్వాల గ్రామంలోని రైతు వేదికలో జరిగిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించేందుకు రైతులు, నేతలు మంగళవారం తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏవో శిరీష ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో అనంతరెడ్డి

## వివాహిత ఆత్మహత్య

ఆమనగల్లు, జూన్ 24: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని మేడిగడ్డ తండాకు చెందిన వ్యడ్తావత్ గోపికి మూడు సంవత్సరాల క్రితం తలకొండపల్లి మండలం గౌరిపల్లి తండాకు చెందిన మధు అనే మహిళతో వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారు. గోపి, వారి కుటుంబ సభ్యులు మధును వరకట్నం తేవాలని వేధించడంతో ఈ నెల 23న ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖాను తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ విషయంపై ఆమె తండ్రి కేతావత్ దేవ్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ వెంకటేష్ తెలిపారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆమనగల్లు, జూన్ 24: చెరువులో దూకి ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని ఆమనగల్లు పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని మంగళపల్లి గ్రామానికి చెందిన దుర్గాపురం కొండల్ కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవడానికి ఆమనగల్లు సురసముద్రం చెరువులో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేష్ వెంటనే స్పందించి పెట్రోలింగ్‌లో ఉన్న సిబ్బందికి సమాచారం అందించాక కానిస్టేబుల్ మల్లయ్య, డ్రైవర్ ఇబ్రహీం హుటాహుటిన సురసముద్రం చెరువు వద్దకు చేరుకుని కొండల్‌ను గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీసి రక్షించారు. అనంతరం కొండల్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి కొండల్‌ను ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాచారం, జూన్24: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ గుర్తు తెలియని వ్యక్తి దవాఖానాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. దీనికి సంబంధించి సీఐ నందీశ్వర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. యాచారం మండల పరిధిలోని నక్కగుట్ట తండా సమీపంలో గల గూగి ప్రాపర్టీస్ వెంచర్ వద్ద నాగార్జునసాగర్–హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఈనెల 22న గుర్తు తెలియని పాదాచారి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం అతన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో అతను అక్కడే కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలతో పడి ఉన్న అతన్ని స్థానికులు పోలీసులు 108 అంబులెన్స్ లో వెంటనే నగరంలోని ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఉస్మానియా దవాఖానాలో చికిత్స పొందుతూ అతను మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**పాముకాటుతో వలస కూలి..**

ఆదిబట్ల, జూన్ 24: పాముకాటుతో వలస కూలి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆదిబట్ల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం కొంగరకలాన్ గ్రామంలోని ఐకేసీ ప్రైవేట్ కంపెనీలో ప్రకాశం జిల్లా ఎల్లుపల్లి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దొంతర తిరుమలయ్య (32) పని చేస్తున్నారు. శనివారం రాత్రి తన గదిలో నిద్రిస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే తన తోటి వర్కర్లు నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## రిటైర్డ్ టీచర్ అదృశ్యం

పెద్దఅంబర్‌పేట, జూన్ 24: పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు అదృశ్యమైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చిలువేరు సత్యనారాయణ సోమవారం రాత్రి ఇంట్లో అందరితో కలిసి నిద్రపోయాడు. ఉదయం లేచేసరికి ఇంట్లో కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. తన భర్త కనిపించడంలేదని సత్యనారాయణ భార్య పుష్పలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

చేవెళ్ల టౌన్, జూన్ 24: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని కళాశాల ప్రిన్సిపాల్ లత తెలిపారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని మంగళవారం చేవెళ్లలో పలు గ్రామాల్లో ప్రచారంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరితే నాణ్యమైన విద్యతో పాట మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, మాలిక్, విజయలక్ష్మి, కవిత, దామోదర్, సతీశ్, రవీందర్ పాల్గొన్నారు.